విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఐనవోలు, నవంబర్ 13 : మండలంలోని గర్మిళపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గర్మిళపల్లి, ఉడుత గూడెం గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఐనవోలు విద్యుత్ శాఖ ఏఈ సురేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

16న 'కిట్స్'లో గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి, నవంబర్ 13 : ఈ నెల 16న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏడో అటానమస్ బ్యాచ్ 2020-24 విద్యార్థుల కోసం 41వ యాన్యువల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, కిట్స్ గవర్నింగ్ బాడీ చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావు హాజరవుతారని చెప్పారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 28 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

దామెర, నవంబర్ 13 : మండలంలోని పులుకుర్తికి చెందిన గోవిందు రాజు(42) వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. అతడికి భీమదేవరపల్లికి చెందిన రజితతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్తతో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లి రాలేదు. మానసికంగా కుంగిపోయి పులుకుర్తిలో మంగళవారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందు తూ మృతిచెందాడు. తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ పీ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, నవంబర్ 13: ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, రీజినల్ కో ఆర్డినేటర్లు, రూట్ ఆఫీసర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్-3 పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు ప్రధాన భూమిక నిర్వహిస్తారని, వారు ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ పరీక్షలకు 83 కేంద్రాల్లో 33,456 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మాత్రమే సెల్ ఫోన్ తెచ్చుకునే అనుమతి ఉందని, మిగతా వారికి అనుమతి లేదన్నారు. 17వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటలకు వరకు మొదటి పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి 5.30గంటల వరకు రెండో పరీక్ష జరుగుతుందని, 18న ఉదయం 10 నుంచి 12.30 వరకు మూడో పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి ముందే వచ్చి వారికి కేటాయించిన స్థలంలో కూర్చోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్లు సదానందం, ఆనంద కిశోర్, డీఆర్వో వైవీ గణేశ్, డీసీపీ సలీమా పాల్గొన్నారు. కాగా, గూప్-3 పరీక్షా ఏర్పాట్లు, సన్నద్ధతపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

పట్టాలు ఉండి రిజర్వ్ ఫారెస్ట్ కానీ భూములను వెంటనే రైతులు దున్నుకొనేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. దేవునూరు, నారాయణగిరి, ముప్పారం, ఎర్రబెల్లి గ్రామాల రైతుల పట్టా భూములను ఫారెస్ట్ అధికారులు అటవీ భూములుగా పరిగణిస్తూ పంట పొలాల్లోకి అనుమతించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో కలిసి ఫారెస్ట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటవీశాఖ రైతుల భూమిని అనధికారికంగా ఆక్రమించడం వల్ల కష్టాలు పడుతున్నట్లు వెల్లడించారు. వెంటనే సర్వే అధికారులను నియమించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి లావణ్య పాల్గొన్నారు.

కాళోజీది ధిక్కార స్వరం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హసన్‌పర్తి : కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

హనుమకొండ, నవంబర్ 13 : ధిక్కార స్వరం ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో కాళోజీ వర్ధంతి నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజీ జీవితచరిత్ర, ఆయన తెలుగు ప్రాముఖ్యతను వివరించిన తీరు అమోఘమని గుర్తుచేశారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచారని, ఎందరో మహనీయుల జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చామని గుర్తుచేశారు. తుది శ్వాస వరకు సమాజ శ్రేయస్సు, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. కాళోజీ నారాయణరావు పేర విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాళోజీ విజ్ఞాన కేంద్రం నిర్మిస్తామంటే 300 గజాల స్థలం కూడా ఇవ్వలేదని, తెలంగాణ సిద్ధించాక కేసీఆర్ నాయకత్వంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మించామన్నారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, రవీంద్రావు, నయూముద్దీన్, విద్యార్థి నాయకులు ప్రశాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాస్యం, బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి : ఎర్రగట్టులో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, ప్యాక్స్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డి, తోట నాగరాజు, మూల దేవేందర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాజీపేటలో మహిళా క్యాంటీన్

ఏర్పాటుకు సన్నాహాలు

క్యాంటీన్‌కు కొనసాగుతున్న ఏర్పాట్లు

కాజీపేట, నవంబర్ 13 : కాజీపేట మినీ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్-2 కార్యాలయ ఆవరణలో త్వరలో మహిళా గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. మున్సి పల్ ఆవరణలోని వివిధ కార్యాలయాలకు ప్రజలు నిత్యం వివిధ పనులపై వస్తుంటారు. తాగునీరు, టీ, స్నాక్స్, టిఫిన్ దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని సోమిడికి చెందిన నక్షత్ర మహిళా పొదుపు సహకార సంఘం ఆధ్వర్యంలో ఇందిర మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సంఘం సభ్యులు మున్సిపల్ ఆవరణలోని రెండు షట్టర్లను అద్దెకు తీసుకుని క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. క్యాంటీన్ త్వరలోనే ప్రారంభమవుతుందని, ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కాజీపేటలో మాట్లాడుతున్న ఏకు శంకర్

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం ప్రభుత్వంపై ధర్మయుద్ధం

కాజీపేట, నవంబర్ 13 : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ధర్మయుద్ధం చేస్తామని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ హెచ్చరించారు. కాజీపేటలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, అనుబంధ సంఘాల సమావేశం బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు నెలలు గడిచినా దీని గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. మాదిగలపై ప్రభుత్వం కపట ప్రేమ ప్రదర్శిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా లక్షలాది మందితో డిసెంబర్ 21న ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ కాజీపేట మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ నాయకులు అక్కెనకుంట వెంకటస్వామి, జేరిపోతుల సారంగపాణి, తిప్పారపు మల్లేశం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రేణుకుంట్ల ఉమా మహేశ్, మంద స్వరాజ్, జేరిపోతుల సతీశ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయ హస్తం ద్వారా రుణాలు మంజూరు చేయాలి

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు డప్పును బహూకరిస్తున్న నేతలు

హనుమకొండ, నవంబర్ 13 : అంబేద్కర్ అభయహస్తం ద్వారా మాదిగ, మాదిగ ఉపకులాలకు రుణాల మంజూరుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్‌ఖన్నా విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రీతమ్ మొదటిసారి జిల్లాలో బుధవారం పర్యటించారు. మేడ స్వామి, పోగుల రాకేశ్, జన్ను సంజీవ్, శ్రీకాంత్, విజయ్‌కాంత్, జోసెఫ్, రఘు పాల్గొన్నారు.

596 కిలోల గంజాయి దహనం

గంజాయిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సుబేదారి, నవంబర్ 13 : వరంగల్ డివిజన్ పరిధిలోని వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ జిల్లాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన 596 కిలోల గంజాయిని దహనం చేశారు. బుధవారం అమ్మవారిపేటలోని కాకతీయ మెడికల్ క్వీన్ సర్వీసెస్‌లో ఆయా జిల్లా ఎక్సైజ్ అధికారులు సమక్షంలో దహనం చేశారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్, రూరల్, జనగామ జిల్లాల సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, అరుణకుమారి, అనిత, హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవానీ పాల్గొన్నారు.

'సుమతీరెడ్డి'లో వర్క్‌షాప్ ప్రారంభం

విద్యార్థినులతో అధ్యాపకులు

హసన్‌పర్తి, నవంబర్ 13 : అనంతసాగర్ శివారులోని సుమతీరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో భాగంగా ప్రాబ్లమ్ సాల్వింగ్, ఐడియేషన్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల పిన్సిపాల్ రాజశ్రీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా హెడ్ నెస్ట్, ఎస్ఆర్‌యూ సుమన్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఐసీ ప్రెసిడెంట్ రంజిత్‌కుమార్, కో ఆర్డినేటర్లు ఝాన్సీ రాణి, శ్వేత, వివిధ విభాగాధిపతులు సుదర్శన్, మహేందర్‌శర్మ, శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, నవంబర్ 13 : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, లేదంటే బిల్లుల్లో కోత విధిస్తామని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం ఆమె 57వ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంబీ రికార్డుల ప్రకారం బిల్లుల చెల్లిస్తామన్నారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఇన్‌చార్జీ ఈఈ సంతోష్‌బాబు ఉన్నారు.

వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి

సమస్యలు వింటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్

ఎల్కతుర్తి, నవంబర్ 13 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని టీజీఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి సూచించారు. బుధవారం ఎల్కతుర్తి సబ్‌స్టేషన్‌లో సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వినియోగదారుల సమస్యలు విన్న చైర్మన్ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. 13రకాల సేవలను అందిస్తున్నామని, వినియోగదారులు తమ ఫిర్యాదులను తమకు నేరుగా లేదా 9440811299, 8333923840, 9491307004 నంబర్లలో ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. విద్యుత్ మీటర్లు, బిల్లులో లోపాల సవరణ, లోవోల్టేజీ, క్యాటగిరీ మార్పిడీ, కొత్త సర్వీసులు తదితర అంశాలపై ఫిర్యాదు చేయొవచ్చన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ టెక్నికల్ మెంబర్ రమేశ్, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ చరణ్‌దాస్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను గుర్తించాలి

సమీక్షిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

దామెర, నవంబర్ 13 : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి గ్రామాల్లో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనులపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో కూలీలకు పనులను కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించడంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు దృష్టి సారించి ఎస్టిమేట్స్ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో శారద పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

- 'పబి'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు
- ఎంపీ కడియం కావ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, నవంబర్ 13 : అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని దిశ కమిటీ చెర్మన్, ఎంపీ కడియం కావ్య అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని; వారిపై కొంత దృష్టిసారిస్తే ఇంకా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల పాఠశాలకి రాని (డ్రాప్ ఔట్స్) విద్యార్థులకు అవగాహన కల్పించి 100శాతం హాజరు ఉండేలా చూడాలన్నారు. 10వ తరగతిలో వంద శాతం ఫలితాలు వచ్చేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళా రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ చార్జెస్ ప్రకారం మెనూను అనుసరించి రుచికరమైన పౌష్టిక భోజనం అందించాలలని కోరారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ప్రత్యే శ్రద్ధ కనబర్చాలని, అవసరమైతే ప్రతి ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెడికల్ హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. హనుమకొండలోని ప్రతి కాలనీలో ప్రతి రోజూ పారిశుధ్య పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పట్టణంలోని ప్రతి వీధిలో వీధి లెట్టు, మున్సిపల్ ట్యాప్ వాటర్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నాగపద్మజ పాల్గొన్నారు.

16 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

వ్యాన్ సీజ్, డ్రైవర్‌పై కేసు నమోదు

పట్టుకున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి, నవంబర్ 13 : అక్రమంగా తరలిస్తున్న 16 టన్నుల రేషన్ బియ్యాన్ని హసన్‌పర్తి పోలీసులు పట్టుకున్నారు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. బుధవారం ఎస్సై సిద్ధయ్య, పోలీస్ సిబ్బందితో కలిసి హసన్‌పర్తిలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో చెన్నంగి చెరువు కట్ట మీది నుంచి మెయిన్ రోడ్డు వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ పోలీసులను చూసి వ్యాన్ ఆపి పారిపోతుండగా పట్టుకున్నారు. వ్యాన్‌లో తనిఖీ చేసి 16 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. బియ్యం విలువ రూ.4.48లక్షలు ఉంటుంది. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం శాలపల్లికి చెందిన వ్యాన్ (ఓనర్ కమ్ డ్రైవర్) గద్దల రవివర్మ బబ్లూ తనకు పరిచయం ఉన్న జమ్మికుంటకు చెందిన జంగిలి సుధాకర్ ఫోన్ చేసి వ్యాన్‌ను కిరాయికి పెట్టమన్నాడు. చింతగట్టు కెనాల్ వద్ద రేషన్ బియ్యాన్ని ఎవరికీ కనబడకుండా తాలువడ్ల గోనె సంచుల్లో నింపి వ్యాన్‌లో లోడ్ చేశారు. ఆ లోడ్‌ను మహారాష్ట్రకు తీసుకెళ్లమన్నట్లు రవివర్మ పోలీసులకు తెలిపాడు. పోలీసులు బియ్యం, వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ రవివర్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆత్మకూరు, ఐనవోలులో 35క్వింటాళ్లు

ఆత్మకూరు/ఐనవోలు:పెద్దాపురంలో బుధవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు. 60ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యాన్ని వరంగల్ నగరానికి తరలిస్తుండగా పెద్దాపురంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పురాణం రమేశ్, కర్ణాకర్, సునీల్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఐనవోలు మండలం పంథిని శివారులో ఎస్సై పస్తం శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ఆటోలో తరలిస్తున్న 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి పోలీసు స్టేషన్ తరలించి ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు పరిశీలన


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు డప్పును బహూకరిస్తున్న నేతలు

హనుమకొండ, నవంబర్ 13 : అంబేద్కర్ అభయహస్తం ద్వారా మాదిగ, మాదిగ ఉపకులాలకు రుణాల మంజూరుకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్‌ఖన్నా విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రీతమ్ మొదటిసారి జిల్లాలో బుధవారం పర్యటించారు. మేడ స్వామి, పోగుల రాకేశ్, జన్ను సంజీవ్, శ్రీకాంత్, విజయ్‌కాంత్, జోసెఫ్, రఘు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో 'ధాత్రి నారాయణస్వామి' కల్యాణోత్సవం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 13 : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో ఉత్తిష్ట గణపతికి ఆరాదన, రుద్రేశ్వరునికి ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై పండితులు గుదిమెళ్ల విజయకుమారాచార్యులు 'ధాత్రి నారాయణస్వామి' కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్తులకు తలంబ్రాల బియ్యం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అందించారు. ఈవో వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్చకులు గంగు మణికంఠశర్మ, ప్రణవ్‌శర్మ, సందీప్‌శర్మ పూజలు నిర్వహించగా సిబ్బంది రజిత, రామకృష్ణ, రంజిత్ సేవలందించారు.

క్రీడాభివృద్ధికి రిలయన్స్ ఫౌండేషన్ తోడ్పాటు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 13 : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం రిలయన్స్ ఫౌండేషన్ తోడ్పాటు అందిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. బుధవారం హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియాన్ని వారు సందర్శించారు. హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ స్టేడియంలోని క్రీడా మైదానాలు, సౌకర్యాల గురించి వారికి తెలిపారు. జేఎన్ఎస్‌లోని హ్యాండ్ బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, జిమ్నాస్టిక్స్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ ట్రాక్, టెన్నిస్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌పూల్ క్రీడా మైదానాలతో పాటు స్పోర్ట్స్ హాస్టల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్, సాగర్ పటేల్, దామోదర్‌యాదవ్, శాట్ అడ్మినిస్ట్రేటర్ రవికుమార్, పవర్ లిఫ్టింగ్ కోచ్ ప్రవీణ్‌కుమార్, కబడ్డీ కోచ్ జ్యోతిశ్వర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కేయూ ఏబీవీపీ నాయకులు

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 13 : బాసరలోని ఐఐఐటీలో ఏబీవీపీ నాయకులపై దాడిని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచెర్ల రాంబాబు ఖండించారు. బుధవారం ఏబీవీపీ కాకతీయ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. అసలు బాసర ఐఐఐటీలో ఎందుకు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారో అర్థంకాక సమాజం నివ్వెరపోతుందన్నారు. ఈ ఘటనలకు కారణమైన యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, రాష్ట్ర నాయకులు గట్టు ప్రశాంత్, సాయి, మణికంఠ, అఖిల్, దినేశ్, విష్ణువర్ధన్, సాగర్, చందు, లోకేశ్, ఆకాశ్ పాల్గొన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

సుబేదారి, నవంబర్ 13 : హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీల్లో పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్లు సతీ